
ఈ వారం కథ


# తెలివి నేర్చుకో మనసా!!




అప్పటికే పార్వతి
కళ్ళల్లో నీళ్ళు జారేం
దుకు సిద్ధంగా వున్నాయి.
కనురెప్పలాడితే చాలు
ఆ ముత్యాలు కురిసినట్టే. పెద
వులు అష్టవంకరలు తిరగబోతున్నాయి.
కాళ్ళు చేతులు సహకరించననేస్తున్నాయి.

**"మాటలు జారేవా... జాగ్రత్త..." ఎంతో పేలవంగా వినవచ్చాయి పార్వతి గొంతు లోంచి ఆ మాటలు రెండూ. రాఘవ స్కూటర్ మీద కాళ్ళాడిస్తూ కూర్చున్న వాడల్లా ఒక్కడుగు ముందుకు వేశాడు.**

**"జాగ్రత్తంటే ... జాగ్రత్త.. ఏం చేస్తావే.. నీ...."**



- సి.సుజాత

'నా చెవులెందుకు వినిపించకుండా పోవు..' పార్వతి గుండెల్లో అలజడి మొదలైంది. లోలోపల నుంచి ఆత్మ ఏదో హెచ్చరిస్తోంది.

'ఏవిటలా నోరు మూసుకుని మాట్లాడవు... అవతల వాడట్లా రెచ్చిపోతుంటే నోరెత్తవేం. ఉప న్యాసాలు చెప్తావేం ఉపన్యాసాలు. ఇప్పుడు చెప్ప సమాధానం చెప్ప' ఇంకో పార్వతి నిద్రలేస్తోంది రెండోవేపునుంచి 'ఏమిటా సమాధానం చెప్పటం. ఇంక వాడు మీదికి వస్తాడు. చేయి జార్తాడు. లేదా బూతులు తిడతాడు. పార్వతి తిడుతుందా? వాడిని కొడుతుందా..?' ఆత్మ తిరగబడుతోంది.

'అయితే అల్లా వెధవలా నోరు మూసుకుం టుందా? దానికి ఆత్మగౌరవం లేదా! తిట్టు పార్వతీ తిట్టవే' ప్రోత్సాహం వస్తోంది ఇంకోవైపునుంచి.

పార్వతి కిందికి జారబోతున్న కన్నీళ్ళను తొక్కి పట్టి " నీ రుబాబు ఏమిటి రాఘవా! అల్లా మర్యాద లేని మాటలేవిటి? నువు మాత్రం ఏం చేస్తావు?" అంత ఫోర్సుగా లేదు, అంత స్పీడ్‌గా రాలేదు.. లోలోపల ఆత్మ ఘోషిస్తోంది.

రాఘవ ఇంకో అడుగు ముందుకు వేశాడు. వేలెత్తి పార్వతికి చూపిస్తూ "నేనేం జేస్తానా? చెప్ప తీసుకుని తంతాను. వళ్ళు బలిసిందా వాగుతు న్నావ్..."

అయిపోయింది, అయిపోయింది. ఆ కాస్త అయిపోయింది, పరువు మర్యాదా అంతా పోయింది.

పార్వతి కాళ్ళకు హఠాత్తుగా చక్రాలొచ్చాయి. గబగబా ఎలా నడిచిందో... చుట్టూ మూగిన కొలీగ్స్ మధ్యలోంచి ఒక్క ఉదుటున ఆఫీసు గేటు దాటింది. అంతా అలుక్కుపోయినట్టుంది. ఎదురుగ్గా రిక్షా అతను గంట గణగణమని మోగిం చేదాకా అది రిక్షా అని అర్థంకాలేదు. ఎక్కడికని చెప్పాలి? ఎంతకు బేరం అడగాలి? దేనికీ గొంతు సహకరించలేదు. శరీరాన్ని ఎత్తి రిక్షాలో పడేసింది. రిక్షా అతను ఈల వేసుకుంటూ స్పీడ్‌గా వెళ్ళిపోతు న్నాడు. చల్లటి గాలి తగిలి శరీరానికి పట్టిన చమట అంతా ఆరిపోతూ వళ్లు జలదరిస్తోంది పార్వతికి. గాజుగ్లాసుని ఎత్తిపడేస్తే కిందపడి ముక్కలయి పోయి మళ్ళీ చిత్రంగా అతుక్కుంటున్నట్టు శరీర భాగాలన్నీ ఒక దగ్గరికి చేరినట్టు అనిపిస్తోంది. గబగబా వెళ్ళిపోవాలి. ఈ పరిసరాలకు దూరంగా వెళ్ళిపోవాలి.

"పోనీయ్ బాబు... గబగబా పోనీయ్" అన్నది పార్వతి.

రిక్షా అతను రిక్షా స్లో చేసి వెనక్కి తిరిగి "ఎక్కడికమ్మా" అన్నాడు.

ఎక్కడికని చెప్పాలో పార్వతికి తోచలేదు. "బీసెంట్ రోడ్డులోంచి తీసుకుపో" అన్నది.

రిక్షా అతను మళ్ళీ రిక్షా స్పీడ్ పెంచి ఈల మొదలుపెట్టాడు. ఆరుగంటలవుతోంది. చీకటి నెమ్మదిగా పరచుకుంటోంది. షాపుల్లో లైట్లు ధగధగా వెలిగిపోతున్నాయి. జనం హడావుడిగా నందడిగా.. అంతా మగాళ్ళే. దర్జాగా చేతులూపు కుంటూ, స్పీడ్‌గా డ్రైవ్ చేస్తూ, లేదా రోడ్డుపక్కన బండి ఆపి ఓ కాలుకింద పెట్టి, ఏ ఫ్రెండ్ తోనో కబుర్లు చెబుతూ, ఓ పక్కన రిలాక్స్‌డ్‌గా నిలబడి దారిన పోయే ఆడవాళ్ళను చూస్తూ.. స్వేచ్ఛగా




**సమూహాల మధ్యలోంచి పార్వతి గబగబా నడుస్తోంది. ఇప్పుడు ఆడవాళ్ళు ఒద్దికగా, వత్తిగిలి నడుస్తున్నట్టు, పిరికిగా దిక్కులు చూస్తున్నట్టు కనిపించడం లేదు. ఎవరి పనిలో వాళ్ళు గబగబా వెళ్ళిపోతున్నట్టే వుంది.**

మన సొంత ఇంట్లో కాళ్ళు చేతులు చాపి పడుకుని విశ్రాంతి పొందుతున్నట్టు...

పార్వతి తలతిప్పి చూసింది. బజార్లో చాలామంది ఆడవాళ్ళున్నారు. రకరకాల డ్రస్సులు, ముడులు, జడలు హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ, షాపింగ్ చేస్తూ. అయితే ఏదో తేడా... వాళ్ల నడకలో, చేతులు ఊపే తీరులో స్వేచ్ఛ ఏదో లేదు. సరుకుల పేకెట్లు మోస్తూ ఒదిగిపోతున్నట్టు నడుస్తూ, పెద్దగా నవ్వి ఏదో తప్పు చేసినట్టు అటూ ఇటూ ఎవరేనా చూస్తున్నారేమోనని చూసుకుంటూ ఏమిటంత పిరికిగా వున్నారు వీళ్ళు? రోడ్డుకి ఆ చివరన నిలబడి పాన్ నములుతూ, సిగరెట్ తాగుతూ పక్కన ఫ్రెండ్ బుజమ్మీద ఈజీగా చేతులు వేసినట్టు ఈ ఆడాళ్ళున్నారా? పార్వతి ఉలికిపడింది.

'జీవితంపట్ల పాజిటివ్ థింకింగ్ వుండాలి. మనం ఎక్కడ నష్టపోతామో అక్కడ శక్తితో నిలబడాలి. ఎక్కడ జారిపడిపోతామో అక్కడ ఖచ్చితంగా నిలబడగలగాలి'.. ఇదీ తన గొంతే. పదేళ్ళుగా కౌన్సిలింగ్ చేస్తున్న గొంతు. ఎక్కడ నిరుత్సాహం, నీరసం కనిపిస్తుందో అక్కడ జీవం పోసేందుకు తాపత్రయపడిన తన గొంతుకు ఇవాళ ఏమయింది!

"ఓరి.. ఓరి.. రంగా.. ఆపరా రిచ్చా... ఓరి రంగా" సందులోంచి పొలికేకతోపాటు పరుగుల మీద వచ్చిపడ్డాడొకడు.

రంగడని పిలిపించుకున్న రిక్షా అతను రిక్షా దిగాడు. "ఒక్క చనం అమ్మా.." అన్నాడు వెనక్కి తిరిగి.

"ఎప్పుడొచ్చినవు మామా.. కబురెట్టా తెలిసిందీ..."

"ఆస్పటల్లో మావూరు సుబ్బాయమ్మ కోడలు నీళ్ళాడిందిరా. ఆమె రేతిరి బయలుదేరొచ్చిందిరా తండిరీ. వైనవైనాలుగా సెప్పింది నాయనా.. మీ అత్తకయితే గుండె జారిపోయి నిలువుగుడ్లు పడి అట్టా నేలన బడిపోయిందనుకో. బిడ్డ ఎట్టాగుం దోనని పచ్చిలాగా కొట్టుకుంటోంది. సుబ్బాయమ్మ కేకలేసింది 'బిడ్డ క్షేమంగానే వుందే పిచ్చిమొకమా అని' ఆమైన రేతిరికి రేతిరి పల్లెపాడుకి నడిసొచ్చి, ఆడనుంచి లారీ పట్టుకున్నం. ఆస్పత్రికాడ మీ అత్తమ్మని వదిలిపెట్టి, నీకోసం తిరుగుతా వుండా.. బిడ్డ కళ్ళబడిందాక మనసు మనసులో లేదనుకో."

రంగడు నవ్వేడు.

"అదుత్త బెదురుగొడ్డు. మనిసంటే ఎట్టుండాల? శిల్లాగుండాల. మిన్ను ఇరిగిపడ్డా నిలబడాల. ఆడ మనిసి గదా తట్టుకోలేకపోయింది."

వచ్చిన మనిషి తల అడ్డంగా ఊపాడు.

"దానికి గుండె ధైర్నం మెండేరా రంగా. పుట్టినకాడ్నించి కంట తడిపెట్టి ఎరగదు. బిడ్డ నిబ్బరమైందే. మరి ఏం నొచ్చుకుందో.."

"కష్టమైతే తట్టుకునేదే, ఇల్లు తగలబడితే, పొమ్ము జారిపోతే ఇయ్యన్నీ ఆరిదిక బాదలు. ఇట్టాంటియి దానికి లెక్కనేదు. అయ్యి తట్టుకుంటది. మట్టిపనికో, తట్టపనికో పోయిందంటే మగోడు దానికింద పాలడు. కానీ దాన్ని తక్కువసేస్తే..."

"బిడ్డ బాదపడింది"

"పడదు మరి. నా రిచ్చాలో ఎవరో ఎక్కిండు. ఆడి కాడ సారా సీసాలుండాయి. ఆడ్ని పోలీసోళ్ళు తరిమారు. ఆడు రిక్షా దూకి సీకట్లో మాయమైనాడు. రిక్షాలో రెండు మూటల సీసాకాయలు. ఇంగ పోలీసులు ఊరుకుంటారా? ఇంటిమీద బడినారు. నేనెరగను మొర్రో అంటే ఇంటారా.. నా పెళ్ళు కుళ్ళబొడిసిన్రు దాని ముంగల్నే. అది ఏడుస్తా వుంది. దాని గోల ఇని ఓ పోలీసాయన దాని జుత్తు గుప్పిటేసుకుని బూతులు కూశాడు. దాని వయసు సంగతెత్తిండు. దానికి రంకు మొగుళ్ళున్నారనిండు. ఇంగ సూడు దాని పనయిపోయె. ఆడ కూతురు కదా దాని మానం తీసే మాటలంటే ఆయువుపట్టున గొట్టినట్టు గదా అది నోరెత్తలేకపోయె. ఇంకోలెక్కన ఈదుల్లో తగవులొస్తే దాని రంకెలు ఇనితీరాల. ఊరువాడ ఏకం చేస్తది. దాన్ని తప్పుడు మాటలన్నాడా పోలీసోడు. సీతాలింక సుట్టు సేరినోళ్ళ మొగం సూసింది. అట్టనే తలొంచుకుని ఇంట్లోకి పోయె. నేను పెద్ద మనుషుల్ని తీసుకుపోయి పోలీస్ స్టేషన్ కాడ దస్కతు చేసి రిక్షా లైసెన్స్ ఆడికాడ ఎట్టి నానా అగచాట్లు బడి ఇంటికి పోయినా. అప్పటికే సీత గన్నేరుపప్పు తింది మావ. వంటిమీద సోయె లేదు. ఆమైన ఆస్పటలకు తీస్కపోయా."

తన బలహీనతకు అర్థం కళ్ళముందు కనిపించే సరికి పార్వతికి కళ్ళు గిర్రున తిరిగాయి.

ఆడదాన్ని లొంగదీసే ఆయుధం... ఆ అంకుశం అది చేయగలిగిన గాయం. దానికి రంగడి పెళ్ళాం కూడా లొంగింది. పార్వతి లొంగుతుంది.

రిక్షా అతను ఛాలెంజ్ చేస్తున్నాడు "నేనదే సెప్తాను మామా. ఆడు సేతగాక నీమీద పడ్డాడే. ఆడు ఓడిపోయి ఆడ కూతురి మీద పడితే అందల నీ తప్పేం వుందే సీతా. నువ్విలాగ గోరానికి తలపడితే నా గతేం గావాల, పిల్లలేం గావాల"

రంగడి గొంతు రుద్ధమైంది. అతను తలకు కట్టుకున్న తుండుగుడ్డ విప్పి దులిపి కళ్ళు తుడుచుకున్నాడు.

"సరే పో.. మామా నేను అమ్మగారిని దింపేసి హాస్పటల్ కాడికి వస్తా..."

రంగడు రిక్షానేపు తిరిగేసరికి పార్వతి దిగేసింది. పర్సు తీసి రంగడి చేతిలో పదిరూపాయలు పెట్టింది. "ఉండమ్మ సెకంలో దింపుతానమ్మ" రంగడు అనేలోగానే పార్వతి అందుకుంది.

"వద్దు.. ఇక్కడే నాకు పనుంది. నేను కాస్త షాపింగ్ చేసుకుని వెళ్ళిపోతాను. నువ్వు పనిచూసుకో..."

తను పది రూపాయల చిల్లరకోసం జేబులో చేయి పెట్టేలోగానే పార్వతి జనంలో కలిసింది. చుట్టూ జనం. తోసుకుంటూ హడావుడి పడిపోతూ ముందుకు వెళ్ళాలని తాపత్రయపడుతూ..

సమూహాల మధ్యలోంచి పార్వతి గబగబా నడుస్తోంది. ఇప్పుడు ఆడవాళ్ళు ఒద్దికగా, వత్తిగిలి నడుస్తున్నట్టు, పిరికిగా దిక్కులు చూస్తున్నట్టు కనిపించడం లేదు. ఎవరి పనిలో వాళ్ళు గబగబా వెళ్ళిపోతున్నట్టే వుంది. మాటిమాటికీ నిండిన కళ్ళు ఇప్పుడు స్వచ్ఛంగా వున్నాయి. తను పొరపాటు చేయలేదు. తన ఉద్యోగ ధర్మం నెరవేర్చింది. కాష్‌లో తేడా రావడం ఇది రెండోసారి. మొదటిసారి హెచ్చరికతో అతను తన పద్ధతులు మార్చుకోలేదు. రెండోసారి పొరపాటుకు రవ్వంత బాధ్యతగా వ్యవహరించలేదు. అతను చెబుతున్న కారణాలు ఏవీ సబబుగా లేవు. పై ఆఫీసర్‌కు నోట్ పెట్టడం తన కర్తవ్యం. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు గవర్నమెంటు ఆఫీసుల్లాగా వుండవు. ఇచ్చిన జీతానికీ

ప్రతిఫలంగా పని, పనిలో ఇంప్రూవ్‌మెంట్ టార్గెట్స్, ఎఛీవ్‌మెంట్స్... ఇదో సర్కిల్. ఇక్కడ టాలెంట్‌కే గుర్తింపు. రాఘవ వంటి గూండాలకు కాదు. ఆఫీసు బయట పదిమంది ముందు రాఘవ చూపింది ఉక్రోషం. రాఘవ బయటపెట్టుకున్న ఓటమిని తను గుర్తించలేకపోయింది.

తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన అతని నోటివెంట వచ్చిన తిట్లు తనను హర్ట్ చేసేందుకు అతను వాడిన పదజాలం... రాఘవ ఊహించినట్టే జరిగింది. తను అవమానపడ్డాననుకుంది. పార్వతి మొహంలోకి నవ్వు చేరింది. రోడ్డు పక్కకు దిగి తను నడిచివచ్చిన బాట వెంట చూసింది. రంగడు వాళ్ళ మామతో ఇంకా చేతులు తిప్పుతూ మాట్లాడుతూనే వున్నాడు. సెన్సిటివ్‌నెస్, బాధ.. దుఃఖం, ఏకాంతం... అబ్బో.. ఎవరు కని పెట్టారో ఏమో.. ఇవన్నీ తనలో బలహీనతలే. అంతకుముందు ఏడ్చినందుకు పార్వతికి సిగ్గేసింది. రంగడు వాళ్ళ మామతో చెప్పింది సెంట్‌పర్సెంట్ కరెక్ట్. కష్టానికి, బాధకు ఓర్చుకోవడం సులభం. రంగడు చూపించిన తెగువ సీత చూపించలేకపోయింది. మనసులో ఓ మెత్తదనం, స్వాభిమానం, ఆత్మగౌరవం... రంగడు కేవలం ఒక సంఘటనగానే అనుకున్న విషయాన్ని మనసుకి దగ్గరగా అనుకోవడం వల్లనే సీత గాయపడింది.. చావే మెరుగని పొరపాటు పడింది. అర్థాంతరపు చావులకు గురయ్యే అభాగ్యులంతా ఈ తప్పే మళ్ళీ మళ్ళీ చేస్తున్నారు. తన తప్పు తెలుసుకున్నాక పార్వతికి ఉత్సాహం వచ్చింది. రైట్ రేపు రాఘవ సంగతి చూడాలి. ఉద్యోగం కాపాడుకోలేకపోవడం అతని తప్పు మొదటి తప్పు ఉక్రోషం చూపించడం, అది ప్రదర్శించిన వైనం రెండో తప్పు ఆ రెండు తప్పులకు పశ్చాత్తాపపడి తీరాలి. పార్వతి బుగ్గ మీద చల్లని చినుకు పడింది. ఇంకో చినుకు.. ఇంకో చినుకు. వాతావరణం చల్లబడిపోతోంది. పార్వతి ఉత్సాహంగా నడుస్తోంది. ఎవరెవరివో బుజాలు, చేతులు తగులుతుంటే ఒక ఆత్మీయతా స్పర్శ. మనిషికీ, మనిషికీ మధ్యన వుండే మానవతా స్పర్శ...

